ప్రజాశక్తి
మంగళవారం 6 జూన్ 2023
5
పార్వతీపురం మన్యం

16న కురుపాంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా కురపాంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ లో ఈ నెల 16న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ మేళాకు 10 కంపెనీ ప్రతినిధులు హాజరుతారన్నారని, పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజీ చదివిన అభ్యర్థులు తమ వివరాలు www.apssdc.in వెబ్ సైట్ నమోదు చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ స్పెషల్ ఆఫీసర్ పి.వినోద్‌కుమార్, సిబ్బంది కంచిబాబు, మనోజ్ కుమార్ పాల్గొన్నారు . మరిన్ని వివరాలకు 6303493720, 8978878557 నంబర్లును సంప్రదించాలన్నారు .

సదస్సులో మాట్లాడుతున్న ఆదివాసీ అధికార మంచ్ చైర్మన్ డాక్టర్ బాబూరావు; హాజరైన గిరిజన ఉద్యోగులు, సంఘాల నాయకులు, యువత

గిరిజన హక్కులు, చట్టాలపై పాలక వర్గాలు దాడి

ఆదివాసీ అధికార మంచ్ చైర్మన్ మిడియం బాబూరావు

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

కేంద్ర, రాష్ట్ర పాలకవర్గాలు గిరిజన హక్కులు, చట్టాలపై ఏదో ఒక విధంగా దాడి చేస్తూ వాటిని నిర్వీర్యం చేసే దిశగా కుట్ర పన్నుతున్నాయని, గిరిజన అభివృద్ధికి ఆటంకంగా మారాయని మాజీ ఎమ్‌పి, ఆదివాసీ అధికార మంచ్ చైర్మన్ డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. స్థానిక బిఎస్‌ఆర్ కల్యాణ మండపంలో సోమవారం గిరిజన రిజర్వేషన్లపై ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. గిరిజనుల హక్కులు, చట్టాలు కాపాడుకొనేందుకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. లేకుంటే భవిష్యత్తు అంధకారమవుతుందని హెచ్చరించారు. 40 ఏళ్ల కిందట పోరాట ఫలితంగా సాధించుకున్న గిరిజనుల హక్కులు, చట్టాలను కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం తన స్వార్థ ప్రయోజనాల కోసం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ అడవి నుంచి గిరిజనులను వెళ్లగొట్టేలా నూతన చట్టాలు తీసుకొచ్చి, పాత చట్టాలకు పాతర వేస్తుందని తెలిపారు. బాక్సైట్ కంపెనీల పేరుతో గిరిజనులను అడవి నుంచి దూరం చేసేందుకు తనకు నచ్చిన విధంగా కార్పొరేట్ కంపెనీలకు అనుమతులు ఇస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తుందన్నారు. ఇదే జరిగితే అందులో పనిచేస్తున్న 3,500 మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోల్పోతారని అన్నారు. 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న సిఆర్‌టిలను రెగ్యులర్ చేయలేదన్నారు. మరోవైపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేసి గిరిజనులకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తుందన్నారు. జిఒ 3ను ఎత్తివేసి వంద శాతం ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిందన్నారు. స్పెషల్ డిఎస్‌సి ప్రసక్తే లేదన్నారు. తరతరాల నుంచి ఉన్న గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగైపోతున్నా భద్రత కల్పించడంలో చొరవ చూపడం లేదన్నారు. 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం పటిష్టంగా అమలు చేయడం లేదన్నారు. గిరిజన అభివృద్ధి కోసం ఏర్పాటైన ఐటిడిఎ ల ద్వారా అభివృద్ధి జరగడం లేదన్నారు. గిరిజనుల తెగను తెలిపే మాతృభాషలో మాట్లాడే హక్కు కూడా లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. గిరిజన కులాల్లో 8 భాషలు ఉన్నాయని, వీటిలో 5 లక్షల మంది సవర భాష, 2 లక్షల మంది కోయ భాష , 3 లక్షల మంది కుయి భాష మాట్లాడుతున్నవారు ఉన్నారని తెలిపారు. వీరి విద్యాబోధన కోసం నియమించిన భాషా వాలంటీర్లను తొలగించడం విచారకరమన్నారు. మతోన్మాద సిద్ధాంతాలతో పాలన చేస్తున్న బిజెపి క్రిస్టియన్లు, మైనారిటీలపై దాడులు చేయిస్తుందని అన్నారు. ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే జరిగితే ఇప్పటికే వెనుకబడి ఉన్న గిరిజన తెగలకు ఉద్యోగ ఉపాధి అవకాశాల్లేకుండా పోతాయన్నారు. సవర భాష వాలంటీర్ల రెగ్యులర్ చేసి పాఠశాలలను నడపాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్ మాట్లాడుతూ గిరిజనుల పట్ల, గిరిజన విద్య పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తూన్నాయని అన్నారు. 126 జిపి పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పాఠశాలలన్నీ సిఆర్‌టిఎలతో నడుస్తున్నాయన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో కనీసం విద్యార్థులకు స్థానికంగా వైద్యం అందించేందుకు ఎఎన్‌ఎం పోస్టులు కూడా వేయలేని పరిస్థితి ఉందన్నారు. ఇలా అయితే గిరిజన విద్య ఎలా మెరుగుపడుతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.తిరుపతిరావు, జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, ఎటిఎ నాయకులు అమర్నాథ్, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు, సవర భాష వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్, మన్యంజిల్లాలోని ఉపాధ్యాయులు, గిరిజన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సాలూరు: గిరిజనుల హక్కుల పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దాడిని ప్రతిఘటించాలని గిరిజన అధికార మంచ్ చైర్మన్ డాక్టర్ మీడియం బాబూరావు కోరారు. సోమవారం సాయంత్రం స్థానిక దీప్తి హైస్కూల్ లో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం దారుణమన్నారు. సవర భాషా వాలంటీర్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో గిరిజనులకు తీవ్ర నష్టమని చెప్పారు. గిరిజన ఉపాధ్యాయుల, సిఆర్టీల సమస్యలు పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో ఆదివాసీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి జన్ని పైడిరాజు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతిరావు పాల్గొన్నారు.

అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్యలను తెలియజేసిన అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్‌ఒ జె.వెంకటరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యల గూర్చి సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరుతూ 72 వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

☞ శ్రీరామా సుగర్ మిల్లు ఉద్యోగులకు 2019 జూన్ నుంచి పెండింగులో గల పిఎఫ్ సుమారు రూ.3కోట్లు చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కోరుతూ యూనియన్ సెక్రటరీ సన్యాసిరాజు,యితర నాయకులు, కార్మికులు అర్జీ అందజేశారు.

☞ మక్కువ మండలం లోవరకండి గిరిజన గ్రామంలో గత కొన్నేళ్లుగా తాగునీరు సదుపాయం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి మంచినీటి సదుపాయం కల్పించాలని ఎన్.సరోజిని, గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు.

☞ పార్వతీపురం పట్టణంలో మున్సిపల్ కొళాయిలు నుంచి వస్తున్న తాగునీరు గత కొద్ది కాలంగా కలుషితమవుతున్నందున ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, బెలగాం వీధిలో మంచినీరు అందించాలని జి.సత్తిరాజు అర్జీ అందజేశారు.

☞ పెండింగ్ లో ఉన్న జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేయాలని ఒడిశాతో వివాదాన్ని తొలగించి పూర్తిస్థాయిలో సాగునీరు రైతులకు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.అప్పలనాయుడు, ఇతరులు దరఖాస్తు అందజేశారు.

☞ మక్కువ మండలం శంబరకు చెందిన ఎ.లక్ష్మి పార్వతీపురం మండలం, కోరి రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 46/9 0.48 సెంట్లు భూమి ఉందని ఆ భూమిని ఆన్లైన్లో నమోదు చేయించి పాస్ పుస్తకం ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు.

☞ మక్కువ మండలం ఎర్రసామంతవలసకు చెందిన కె.బాబ్జీ ఐటిడిఎ పరిధిలో గల గిరిజన బిఇడి కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుచున్నానని, తనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాల్సిందిగా కోరారు.

☞ భామిని మండలం పెద్దదిమిలికి చెందిన ఎం.రాధాపాణి సర్వే నెంబర్ 210లో 1.39 సెంట్లు, సర్వే నెంబర్ 528 –13లో 0.68 సెంట్లు భూమి ఉందని ఆ భూమికి రీ సర్వే జరిపించాలని వినతి పత్రం సమర్పించారు.

☞ కొమరాడకు చెందిన పి.లక్ష్మి సర్వే నంబర్ 307/33 లో 0.39 సెంట్లు భూమి ఉందని తన భూమి వేరే వారు అక్రమంగా దౌర్జన్యం చేసి ఉన్నారని వారిపై చర్యలు తీసుకొని భూమి తనకు అప్పగించాలని కోరారు.

☞ గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లుకు చెందిన కె.దుర్గారావు సర్వేనెంబర్ 24.4 సుమారు 1.50సెంటు భూమిని ప్రభుత్వం వారు పాఠశాల నిర్మాణానికి తీసుకున్నారని, అయితే ఇంతవరకు తనకు నష్టపరిహారం చెల్లించలేదని, వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని వినతి పత్రం సమర్పించారు.

☞ కొమరాడ మండలం మార్కండపుట్టి గ్రామానికి చెందిన టి.గౌరిప్రసాద్ వై.ఎస్.ఆర్ పెళ్లి కానుక మంజూరు చేయాలని కోరారు.

☞ కురుపాం మండలం ఇప్పమాను గూడా గ్రామానికి చెందిన యం.మాస పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పాఠ్య పుస్తకాలకు 5శాతం సొమ్ము చెల్లించాలి : డిఇఒ

సాలూరు : మండలం, పట్టణంలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాల కోసం ముందుగా ఐదు శాతం సొమ్ము చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి నిమ్మకు ప్రేమ్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలకు అవసరమైన పాఠ్యపుస్తకాల ఇండెంట్ పెట్టాలని కోరారు. అంతకు ముందు ఆయన పట్టణంలోని గాడి వీధి, డబ్బి వీధి మున్సిపల్ హైస్కూల్‌ల్లో జరుగుతున్న పదోతరగతి సప్లిమెం టరీ పరీక్షలను పరిశీలించారు. పట్టణంలో నాడు నేడు పనులు నిర్వహిస్తున్న పాఠశాలలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఇఒ రాజ్ కుమార్ వున్నారు.

పర్సా సత్యనారాయణ చిత్ర పటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కార్మికోద్యమ నేత పర్సా

ప్రజాశక్తి - కలెక్టరేట్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కార్మికుల నేత పర్సా సత్యనారాయణ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మధరావు పిలుపునిచ్చారు. పర్సా సత్యనారాయణ శతజయంతి సందర్భంగా సోమవారం స్థానిక సుందరయ్య భవనములో సిఐటియు ఆధ్వర్యంలో పర్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మన్మధరావు మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ కార్మికుల హక్కులు, శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేసిన మహా వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడని, సింగరేణి కార్మికుడిగా పనిచేసి ఆ కార్మికులకు యూనియన్ నాయకుడిగా ఎదిగి అక్కడే ఎమ్మెల్యేగా పని చేశారని అన్నారు. కార్మికులకు ఏం కావాలో ఆ పని చేసి పెట్టేవారని, అలాంటి మహా ఉద్యమ నాయకుడి శత జయంతి ఉత్సవాలు 2024 జూన్ 4 వరకు దేశవ్యాప్తంగా జరగనున్నాయని, ఇందులో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని అదే పర్సా సత్యనారాయణకు మన ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు అప్పలస్వామి, హరినాథ్, శ్రీను, మూర్తి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

17 వరకు అతిసార నియంత్రణ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

అతిసార నియంత్రణ పక్షోత్సవాలను (ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్ నైట్- ఐడిఎఫ్‌సి) జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి జిల్లా ఆసుపత్రిలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒఆర్‌ఎస్, జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల్లో డయేరియా ద్వారా సంభవించే మరణాలను నివారించడం ముఖ్యోద్దేశమన్నారు. ఈ నెల 17 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో కార్యక్రమం కొనసాగుతుందని, ఐదేళ్లలోపు పిల్లలున్న ఇళ్లకు వైద్య సిబ్బంది సందర్శించి ఆ ఇంటిలోని తల్లులకు ఈ కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించడం, డయేరియా లక్షణాలున్న పిల్లలను గుర్తిస్తే వెంటనే వారికి ఒఆర్‌ఎస్, జింక్ తగు మోతాదులో ఇవ్వడం, ఒఆర్‌ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేసుకోవాలో తెలియజేయనున్నట్టు వివరించారు. ముఖ్యంగా చేతుల పరిశుభ్రత పై అవగాహన, ఒఆర్‌ఎస్, జింక్ కార్నర్‌లను ఏర్పాటు చేయడం కార్యక్రమంలో చేపట్టడం జరుగుతుందన్నారు. డాక్టర్ బి.వాగ్దేవి మాట్లాడుతూ డయేరియా సోకిన రోగి ఒఆర్‌ఎస్ ద్రావణం, అలాగే తీవ్రతను, అతిసారం కాల వ్యవధిని తగ్గించడానికి జింక్ మాత్రలు ఆవశ్యకమని అన్నారు. జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహన రావు మాట్లాడుతూ డయేరియా లక్షణాలు గుర్తించిన పిల్లలు, వారి చికిత్సా వివరాలు ఎప్పటికప్పుడు నివేదికలను పంపించాలని సూచించారు. సూపర్ వైజర్స్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

భూ రీసర్వేను త్వరితగతిగా పూర్తి చేయాలని ఆర్‌డిఒ కె.హేమలత అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, చల్లంనాయుడువలసలో జరుగుతున్న భూసర్వేను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో సర్వే చేయాలన్నారు. రైతులకు ఉండే సమస్యలను అక్కడికక్కడ పరిష్కరించే దిశగా ఉండాలన్నారు. సర్వేను రైతులకు చేరేలా గ్రామాల్లో పూర్తిస్థాయి ప్రణాళిక ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవి రమణ, ఆర్ఐ కరుణాకర్, సర్వే డీటీ చిట్టెమ్మ, సర్వేలు రైతులు పాల్గొన్నారు.

గృహనిర్మాణశాఖ అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

హౌసింగ్ అధికారులతో డిప్యూటీ సిఎం సమీక్ష

ప్రజాశక్తి- సాలూరు

నియోజకవర్గంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో భాగంగా ఇళ్ళు నిర్మాణాలు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆదేశించారు. సోమవారం ఉదయం తన నివాసంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా ఇళ్ళు నిర్మాణ పురోగతి అడిగి తెలుసుకున్నారు. నెలిపర్తి లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పన పై దృష్టి సారించాలని సూచించారు. మండలాల్లో ఇళ్ళ నిర్మాణం ప్రారంభించని వారి ఇళ్ళ రద్దు చేసి కొత్త వారికి మంజూరు చేయాలని ఆదేశించారు. గుమడాం లేఅవుట్ –5లో లబ్ధిదారులతో త్వరితగతిన ఇళ్ళ నిర్మాణం ప్రారంభించేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సాలూరు హౌసింగ్ డిఇ జి.సోమేశ్వరరావు, గజపతినగరం డిఇ ఎం.సత్యనారాయణ, ఎఇలు సత్యనారాయణ, శ్రీనివాసరావు, సింహాచలం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్త నిల్వ కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో రక్తనిల్వ కేంద్రాన్ని త్వరితగతిన ప్రారంభించాలని ఎమ్మెల్యే, ఆసుపత్రి అభివృద్ధి సంఘ చైర్‌పర్సన్ విశ్వాసరాయి కళావతి అన్నారు. సోమవారం ఆమె ఆధ్వర్యంలో స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉండి చికిత్స పొందుతున్న రోగులకు మూడు పూటలా భోజనం పెట్టాలన్నారు. 300ఎంఎ ఎక్స్‌రే ప్లాంట్‌ను మరమ్మతులు చేసి రోగులకు సేవలందించాలన్నారు. కంప్యూటర్ సిస్టమ్, ఎసి కూడా ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. ఆస్పత్రికి అవసరమైన సదుపాయాలను తన నిధుల నుంచి లేదా ఐటిడిఎ పిఒ నిధుల నుండి గాని సమకూర్చమని కోరుతూ తీర్మానం చేశారు. ఫార్మసీ విభాగంలో మందులు, వాక్సిన్‌లు నిల్వచేయడానికి తగు గదులు సరిపడకపోవటం వల్ల మందులు పేర్చుకోవడానికి అవసరమయ్యే రాక్స్, బీరువాలు హెచ్‌డిఎస్ నిధుల నుండి కొనుగోలు చేయడానికి తీర్మానం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతినెల 110 నుంచి 140 వరకు డెలివరీలు చేస్తున్నందున ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అత్యధిక డెలివరీలు చేస్తున్న సిహెచ్‌సిల్లో మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ సమావేశంలో సీతంపేట ప్రాంతీయ ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఎఎంసి చైర్‌పర్సన్ హిమరిక, మోహన్ రావు, ఎంపిపి బి ఆదినారాయణ, సూపరిండెంట్ బి.శ్రీనివాసరావు, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, సర్పంచ్ కళావతి, ఎంపిడిఒ కొండపల్లి సత్యం, వైద్యాధికారులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న రాజన్నదొర

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ర్యాలీని ప్రారంభించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

పర్యావరణ పరిరక్షణకు అందరి బాధ్యత అని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం అటవీశాఖ, నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు జిల్లా అటవీ అధికారి ప్రసూన రాజన్నదొరకు మొక్కలు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత గురించి వివరిస్తూ నీడ్ స్వచ్ఛంద సంస్థ ముద్రించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్లనే వాతావరణంలో అనూహ్య మార్పులు వస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు, అటవీ రేంజ్ అధికారి కె.రామారావు, సెక్షన్ అధికారులు దేవరాజు, నారాయణరావు, ఎంపిడిఒ పార్వతి, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సత్యవతి, మెప్మా సిఎంఎం ఎం.పుష్ప, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు నిరసన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని, పంచాయతీలకు అప్పగించరాదని అన్నారు. సుమారు 12 నెలలు బకాయిలు ఉన్నాయని, మండలంలో అనేక గ్రామాల్లో ఒక్కొక్క పంచాయతీకి ఒక్కో రకంగా వేతన బకాయిలు ఉన్నాయని గుర్తు చేశారు. కొన్ని పంచాయతీల్లో వేతనాలు చెల్లించాలని అడిగితే డ్యూటీలు నుండి తొలగిపోవాలని సర్పంచులు చెప్పడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నివారణకు కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం దురదృష్టకరమైన చర్యని అన్నారు. స్వచ్ఛభారత్, క్లీన్ ఆంధ్రప్రదేశ్ ప్రచార ఆర్భాటాలు తప్ప పనిచేసే కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం, వెట్టి చాకిరి చేయించుకోవడం సిగ్గు చేటన్నారు. తక్షణమే గ్రీన్ అంబాసిడర్లు సమస్యలు పరిష్కారం చేయాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎపి పంచాయతీ వర్కర్స్ పాలకొండ మండల కమిటీ గౌరవ అధ్యక్షులు కాద రాము, టి .శంకర్రావు, రవి, ఎం. వైకుంఠరావు, కూర్మారావు, గ్రామాల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

12న విత్తన దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈనెల 12న విత్తన మహోత్సవం గుంటూరులో జరుగుతుందని శాస్త్రవేత్త అధిపతి పి.సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విత్తన మహోత్సవం సందర్భంగా వివిధ రకాల పంటలకు చెందిన విత్తనాలైన వరి, కంది, మినుములు, పెసలు, రాగులు, కొర్ర రైతులు ఈ కార్యక్రమానికి విచ్చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాలంటీర్ దాతృత్వం

ప్రజాశక్తి- పాలకొండ

మండలంలోని ఎల్ఎల్‌పురం గ్రామ వాలంటీర్ పైల విజయలక్ష్మి సోమవారం పింఛను ఇవ్వడానికి గ్రామం నుంచి వైజాగ్ వెళ్లారు. ఈ గ్రామంలో నివాసం ఉంటున్న తంగుడు సూర్యనారాయణకి తీవ్ర అనారోగ్యం కారణంగా వైజాగ్ కళా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆ వార్డు వాలంటీర్ పైల విజయలక్ష్మి తనే స్వయంగా వైజాగ్ హాస్పిటల్‌కి వెళ్లి పింఛను అందజేశారు. ఇలాంటి పరిస్థిల్లో వున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ వృద్ధాప్య పింఛన్ ఎంతో ఉపయోగపడుతిందని నాయకులు ద్వారపూడి చిన్న అప్పలనాయుడు అన్నారు. వాలంటీర్ విజయలక్ష్మిని గ్రామస్తులు అభినందించారు.

తంపటాపల్లి సచివాలయ సందర్శన

ప్రజాశక్తి- పాలకొండ

మండలంలోని తంపటాపల్లి సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు సోమవారం సందర్శించారు. సిబ్బంది హాజరుతోపాటు రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాలంటీర్లను సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు.

కంబరలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని కంబరలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి ప్రదీప్ కుమార్ వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓ శాంతకుమారి, ఏఎన్ఎం హేమలత, ఎంఎల్ హెచ్పి, టెక్నీషియన్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

20న వ్యకాస జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభ ఈనెల 20న పార్వతీపురం పట్టణంలో జరగనున్నాయని, వీటిని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స మోహనరావు, గరుగుబిల్లి సూరయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి, గౌరవాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సత్యప్రకాష్, పువ్వుల ప్రసాదు, నారాయణపురం సింహాచలం సమితి సభ్యులు పాల్గొన్నారు.

అన్నార్తుల ఆకలి తీర్చడంలోనే తృప్తి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అన్నార్తుల ఆకలి తీర్చడంలోనే నిజమైన తృప్తి ఉంటుందని సీనియర్ పాత్రికేయులు గౌరీశంకర్ రావు అన్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారిలో గల వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద తన స్నేహితులతో కలిసి పేదలకు అన్నదానం చేశారు. ప్రతి ఒక్కరూ తమ జన్మదిన వేడుకలకు హంగు, ఆర్భాటాలకు, పోటుకుండా, వృధా ఖర్చులు పెట్టకుండా, నిరు పేదలకు, వృద్ధులకు ఎంతో కొంత సహాయపడి ఎదుటివారిని ఆదుకోవాలని నిలవాలని కోరారు.

7న కురుపాం మండల సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 7న ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఒ వివి శివరామప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని శాఖల మండల అధికారులు తప్పనిసరిగా వారికి సంబంధించిన పూర్తి సమాచారం పట్టుకొని హాజరవ్వాలని అలాగే మండలంలో గల సర్పంచులు, ఎంపిటిసిలు వారి పరిధిలో గల సమస్యలు, సమాచారంతో హాజరవ్వాలని కోరారు.

సాలూరు ఎంపిడిఓగా రమాదేవి

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్థానిక మండల పరిషత్ రెగ్యులర్ ఎంపిడిఒగా ఎం.రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో జిల్లా పరిషత్‌లో ఎఒగా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఎంపిడిఒగా నియమితులయ్యారు. 2020 జనవరి నుంచి ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా జి.పార్వతి పని చేశారు. కొత్త ఎంపిడిఒ. రమాదేవికి వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.కార్యాలయం సిబ్బంది ఆమెను కలిశారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రాన్నిస్తున్న కళింగ వైశ్య సంఘం పెద్దలు

విగ్రహ ఏర్పాటుకు స్థలం మంజూరు చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని మంజూరు చేయాలని పట్టణంలోని కొత్తవలస ప్రాంతానికి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం పెద్దలు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు మూల కారకులైన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు చేసుకోవాలని భావిస్తున్నామని, అందుకు అనువైన స్థలాన్ని కొత్తవలస ఫ్లైఓవర్ వంతెన ప్రాంతంలో కేటాయించాల్సిందిగా ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ విగ్రహం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని మంజూరు చేసేలా మున్సిపల్ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైసిపి నాయకులు జి.బాలమురళీకృష్ణ, కొత్తవలస కళింగ వైశ్య సంఘం పెద్దలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మహిళలు, గిరిజన సంఘం నాయకులు

ఖాళీ బిందెలతో గిరిజన మహిళల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్

తమకు తాగునీరందించాలని గిరిజన మహిళలు డిమాండ్ చేసారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఖాళీ బిందెలతో వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ మాట్లాడుతూ మక్కువ మండలం డి.శిర్లాం పంచాయతీ లోవరకండి గిరిజనులు గత కొన్నేళ్లుగా తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నియోజకవర్గంలో ఏమిటీ పరిస్థితి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఇంటింటికీ తాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారం రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారం కాకపోతే నిరాహారదీక్ష చేస్తామని స్పష్టం చేశారు. నిర్వహించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పర్యావరణ పరిరక్షణకు అందరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం వైద్య సిబ్బందితో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. ర్యాలీ నినాదాలతో ఆర్‌టిసి కూడలి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యానికి ప్రధాన కారణ భూతమైన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. వ్యర్థాలను చెత్త తొట్టెలో వేయడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రధాన భూమిక వహిస్తున్న చెట్లను కాపాడుకోవాలని, మొక్కలు విస్తృతంగా నాటాలని ఆయన పేర్కొన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం సంద్భంగా పలు కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆర్‌డిఒ కె.హేమలత రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భావితరాలకు మంచి గాలి, నీరు, ప్రకృతి అందించాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని, ప్రజలు మరింత అవగాహన పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి.వాగ్దేవి, డిఐఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వై.విజయ్ మోహన్, డా.నవీన్, డా.వినోద్, డెమోలు సన్యాసిరావు, యోగీశ్వరరెడ్డి,

పార్వతీపురం : మొక్కలు నాటుతున్న ఆర్‌డిఒ, డిఎంఅండ్‌హెచ్‌ఒ

వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యతని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక ఎస్. సొసైటీ కార్యదర్శి ఎస్‌కె గౌస్ నిర్వహించిన ఎరకన్న కోనేరు గట్టు మీద మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్క పౌరుని బాధ్యతని మొక్కల పెంపకం, వాటి సంరక్షణ ద్వారా వాతావరణ కాలుష్యం నివారించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, వైసిపి జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేష్‌కుమార్, ఎపిఒ బావాజీ, జిల్లా ఉపాధి హామీ అంబడ్స్‌పర్సన్ కె.సన్యాసి రాజు, అటవీ శాఖ అధికారి సూర్య ప్రకాష్ స్థానికులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక మండల వ్యవసాయాధికారి వారి కార్యాలయంలో డిఆర్‌సి ఎడిఎ శారద వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ప్రకృతి వ్యవసాయం గూర్చి రైతులకు అవగాహన కల్పించి, అవి వారు ఆచరించేలా చేస్తే నేల కాలుష్యాన్ని తగ్గించవచ్చని చెప్పారు. పచ్చి రొట్ట ఎరువులు ఉపయోగించడం వల్ల భూభౌతిక లక్షణాలు అభివద్ధి చెందుతాయని సేంద్రియ కర్బనం అభివృద్ధి చెంది భూసారం పెరుగుతుందని, భూకాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి, గ్రామ వ్యవసాయ,ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

సీతంపేట : ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని దోనుబాయిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీతంపేట వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పొన్నాడ సీతారాం మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవాలని, పర్యావరణ రక్షించుకొని భావితరాలకు మంచి ప్రకృతిని అందించాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయం పాటించాలని తెలిపారు, ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ శంకర్రావు మాట్లాడుతూ పాడి పంటలు కలిసి ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని, నాటు కోళ్ల పెంపకం చేసుకుంటూ అదనపు ఆదాయం పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి అమరేశ్వరి, వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ,

కురుపాం : మొక్కలను నాటుతున్న ఎంపిపి శెట్టి పద్మావతి

మాస్టర్ రిసోర్స్ పర్సన్, ఎం.రవీంద్రనాథ్ మా తోట మన్యావన సహజ సిఇఒ బి.శంకర్రావు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ దినోత్సవ సందర్భంగా సీతంపేట పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ఎంపిడిఒ కొండపల్లి సత్యం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యదర్శి సుదర్శన్‌రావు, సర్పంచ్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని వ్యవసాయాధికారి కె. తిరుపతిరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణకు వ్యవసాయ శాఖ తరపున ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణాన్ని పరిరక్షిస్తూ వ్యవసాయ కార్య కలాపాలు చేపట్టాలని ముఖ్యంగా రైతులకు విచక్షణారహిత పురుగు మందులు ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలని కోరారు. అంతర పంటలతో జీవ వైవిధ్యాన్ని పెంపొందింప చేయడం ద్వారా మిత్ర పురుగుల సంఖ్యను పెంచవచ్చన్నారు. మనుషులతో కలుపు నివారించడం, అంతర పంటలు, పవర్ వీడర్‌తో కలుపు నివారణ చేపట్టుకుని కలుపు మందులు, గుళికల రూప రసాయనాలు తగ్గించడం ద్వారా నేల స్వభావాన్ని కాపాడుకోవచ్చునన్నారు. లోతైన వేసవి దుక్కులు చేయడం నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం ద్వారా నీటి నిల్వను పెంచి తద్వార నీటి వినియోగాన్ని తగ్గించి జల వనరులను పరిరక్షించుకోవచ్చు అని తెలిపారు. మొక్కజొన్న వంటి ఇతర వ్యర్థాలను కాల్చి వేయకుండా మట్టిలో దున్ని కలపడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చున్నారు.

స్పందనకు 31 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 31 వినతులు వచ్చాయి. వినతులను ఎపిఒ రోషి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వీటిలో చిన్న మల్లిపురానికి చెందిన సరోజిని ఆర్ఒఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని కోరారు. వంతఓడ కాలనీలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని వెంకయ్య విన్నవించారు. తాబేలువలసలు హౌసింగ్ బిల్లులు మంజూరు చేయాలని చిన్నమి కోరారు. పాలవలసకు చెందిన చంద్రరావు పవర్‌వీడర్ ఇప్పించాలని, కండసింగిగూడకు చెందిన అప్పారావు కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలని విన్నవించారు. హిమగిరి చెందిన సుస్మిత పేపర్ ప్లేట్‌మిషన్ మంజూరు చేయాలని కోరారు. బెన్నడుగూడకు చెందిన లక్ష్మీనారాయణ సిసి రోడ్డు మంజూరు చేయాలని, అంబలగంటికి చెందిన కృష్ణయ్య వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని, కుడ్డబా చెందిన నాగమ్మ మేకల రుణం ఇప్పించాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమంలో సిడిపిఒ రంగలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, ఎటిడబ్ల్యుఒ మంగ వేణి, పిఎఒ హరికృష్ణ, ఒఎస్‌డి యుగంధర్ పాల్గొన్నారు.

ధర్నాకు స్పందించిన అధికారులు

కురుపాం: మండలంలో నీలకంఠాపురం పంచాయతీలో గల జుంబిరిలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆధ్వర్యంలో నాయుడుగూడ గిరిజనులు గతనెల 29న నిరసన తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ గిరిజనులకు ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఆ గిరిజన గ్రామ ప్రజలు సోమవారం కొల్లి గంగు నాయుడుతో కలిసి స్థానిక తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్‌కు వినతి పత్రం ఇవ్వడానికి మండల రెవెన్యూ కార్యాలాయనికి వచ్చారు. వెంటనే తహశీల్దార్ స్పందించి తక్షణమే జుంబిరి డిపో ద్వారా ఈనెల నుంచి రేషన్ సరుకులు నాయుడుగూడ గిరిజనులకు ఇవ్వాలని సివిల్ సప్లై డిటిని ఆదేశించారు. అనంతరం ఆ గ్రామ గిరిజనులు మాట్లాడుతూ బియ్యమైతే జుంబిరి డిపోకు పంపించడం బాగానే ఉంది కానీ వేలిముద్ర వేయడానికి నీలకంఠాపురం వెళ్లాలంటే ఇబ్బందులు తప్పవని అన్నారు. కావున ఆఫ్‌లైన్‌లోనే బియ్యం అందించాలని తహశీల్దార్‌కు వినతిని అందించామన్నారు. ఆఫ్‌లైన్‌లోనే బియ్యం పంపిణీ చేసేలా అధికారులు చూడాలని లేనిచో భవిష్యత్తులో ఆఫ్‌లైన్‌లో బియ్యం ఇచ్చేవరకు ఆందోళనలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో నాయుడుగూడ గిరిజనులు ఎం. చిన్నారావు, సోమయ్య, పొట్టు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం అధోగతి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం అధోగతి పాలైందని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. సోమవారం నర్సిపురం పంచాయతీ కారాడవలసలో జరిగిన ఏరువాక పున్నమి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, పరిశీలకులు బోయిన గోవిందరాజుతో కలిసి పాల్గొన్నారు. ముందుగా అరకతో పొలం దున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ వైసిపి రద్దు చేసిందని విమర్శించారు. రైతుల విద్యుత్ సబ్సిడీని ఎగ్గొట్టేందుకు మీటర్లు బిగించడం, ఎన్టీఆర్ జలకళ పేరుతో ఉన్న పథకాన్ని వైయస్సార్ జలకలాగా మార్చినప్పటికీ రాష్ట్రంలో ఎక్కడా అమలు చేసిన దాఖలాల్లేవన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నప్పటికీ ఎక్కడా అవి రైతులకు ఉపయోగపడుతున్న సందర్భంగా లేవన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అన్నదాత కార్యక్రమం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని ఇటీవల తమ నాయకుడు ప్రీ మేనిఫెస్టోలో ప్రకటించారని అన్నారు. మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చి రైతులకు వ్యవసాయాన్ని పండుగ్గా మారుస్తుందని, రాష్ట్రంలోని వ్యవసాయ దారులంతా ఎదురుచూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ కార్యదర్శి గొట్టాపు వెంకట నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు దొగ్గ మోహనరావు, కార్యదర్శి బోను చంద్రమౌళి, నాయకులు గర్భపు ఉదయభాను, గొట్టాపు వెంకటరమణ, పెదిరెడ్ల సత్యనారాయణ డి.నాగేశ్వరరావు చుక్క జయప్రకాష్ జి.రామ్మూర్తి కె.ప్రదీప్ కుమార్, ఎంద్రాపు చిన్న రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని తాళ్లబురిడి గ్రామస్తులు ఎదుర్కొంటున్న తాగునీరు సమస్యకు శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో రూ.24 లక్షలతో రక్షిత మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు వీధులకు తాగునీరు పంపిణీ సక్రమంగా జరగడంలేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, క్షేత్రస్థాయిలో అధికారులతో పర్యటించి పరిశీలించగా, పంపిణీకి కావాల్సినంత ప్రెషర్ చాలకపోవడంతో అదనంగా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ ఆవశ్యకత ఉందని తెలియడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల

జియ్యమ్మవలస: మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వివరాలను లబ్ధిదారులకు అందిస్తూ వారి మద్దతును కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్మన్ ఎం.భాగ్యలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు మద్రాపు మంగమ్మ, నాయకులు బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు, వై.తిరుపతిరావు, పాల్గొన్నారు.

జియమ్మవలస: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. సోమవారం పెదమేరంగి గడపగడపకు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నవరత్నాలు అమలు చేస్తూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. మహిళాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ డ్వాక్రా గ్రూపు మహిళలకు అండగా జగనన్న ప్రభుత్వం నిలుస్తుందని ఆసరా పథకంతో మహిళలను ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతిని ఆకాంక్షిస్తూ జగనన్న ప్రభుత్వం నిలుస్తుందని భవిష్యత్తులో జగనన్న ప్రభుత్వానికి మద్దతు పలకాలని ఆమె ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం శశికళ, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ ఎం గౌరీ శంకరరావు, డిసిసిబి డైరెక్టర్ లోలుగు నారాయణరావు, వైస్ ఎంపిపి గుడివాడ సంపత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని నిరసన

ప్రజాశక్తి - బలిజిపేట

ఉపాధి పనుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మండలంలోని చిలకలపల్లిలో వేతనదారులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు యమ్మల మన్మధ రావు మాట్లాడుతూ ఉపాధి పనుల్లో మౌలిక సదుపాయాలైన తాగునీరు, పనిచేసే స్థలంలో టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు తదితర మౌలిక వసతులతో పాటు సమ్మర్ అలెవెన్స్ ఇవ్వాలని, ఒక్క పూట ఉపాధి పని కల్పించాలని, 200 రోజులు పనులు, రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. కూలీల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము రేగుతోంది

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోవడంతో వాహన రాకపోకల కారణంగా దుమ్మురేగిపోతుంది. వట్టిగెడ్డ వంతెన నుండి స్వామి థియేటర్ వరకు 1.2 కిలోమీటర్ల పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ 5.5 కోట్లతో రహదారి విస్తీర్ణ పనులు జరగవలసి ఉంది. ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ ఏడాది మే 1 తేదీ నుండి పదో తేదీ వరకు శ్రీ పైడితల్లి గ్రామదేవత పండగ ఉన్నందున తెలగ వీధి జంక్షన్ నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు జెసిబి ద్వారా రహదారిని తవ్వకాలు జరిపి 40 ఎంఎం షిప్స్‌తో పరచి రోలింగ్ చేశారు. భారీ వాహన రాకపోకలు సాగటం వల్ల రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపార షాపులతోపాటు రహదారిపై ఉన్న ప్రజలపై కూడా దుమ్ము ధూళి చేరడంతో రోగాల బారిన పడుతున్నారు. అక్కడక్కడ రాళ్లు రహదారిపై తేలడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు చిప్స్‌పై స్కిడ్ అవుతున్నాయని తీవ్ర భయమందోళనకు గురవుతున్నారు. విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

చిప్స్ వేసి వదిలేసిన రహదారి ఇదే...

కలెక్టర్‌ను సత్కరించిన మీడియా

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో అన్ని అర్హతలు కలిగి, అన్ లైన్ లో అప్ లోడ్ దరఖాస్తు చేసిన 139 మందికి అక్రిడిటేషన్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా జిల్లాను అభివద్ధి పథంలో తీసుకువెళ్తూ జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు తెచ్చినందుకు జిల్లా కలెక్టర్‌ను జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు సత్కరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు టి.వి.ఎస్.సుధాకర్ (డిపిటిఒ), టి.రమేష్ (హౌసింగ్ పీడీ), కె.రామకృష్ణారావు (కార్మిక శాఖ సహాయ కమిషనర్), భాను (ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్), పత్రికా ప్రతినిధులు ఎ.జయంత్ కుమార్, ఎం.రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు టి.నవీన్, టి.శ్రీనివాసరావు, కన్వీనర్ లోచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సత్కరిస్తున్న మీడియా ప్రతినిధులు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్ మాష్టర్ జి.మురళి ప్రపంచం పర్యావరణ దినోత్సవం సందర్భముగా పిల్లలు వేసిన చిత్రాలను, కాలుష్యం ఎలా ఏర్పడుతుందో వాటిని చార్ట్‌ల రూపంలో తయారు చేశారు. యోగ మాష్టర్ కె. జనార్ధన్ రావు పిల్లల చేత కొన్ని చలాకి ఆటలను, యోగ ఆసనాలను నేర్పించారు. గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

ఆటల పోటీలు

గుమ్మలక్ష్మీపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వహణ అధికారి డొనక సుకన్య విద్యార్థుల చేత ఖోఖో, మ్యూజికల్ చైర్ ఆటలు ఆడించారు. ఆటల్లో గెలుపొందిన వారికి ముగింపు రోజున సర్టిఫికెట్లు ఇస్తామని తెలిపారు. వేసవి శిబిరాలు పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. చిన్నారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఖోఖో ఆడుతున్న పిల్లలు

పాము కాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జియమ్మవలస

పాము కాటుకు వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని శిఖబడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో గ్రామానికి చెందిన ఎర్ర రామారావు(45) అక్కడికక్కడే మృతి చెందారు. తన మేనమామ చనిపోవడంతో 11వ రోజు కార్యక్రమం కోసం స్మశాన వాటికకు వెళ్ళిన రామారావు చెట్టుకు తన మేనమామ అస్తికలు కడుతుండగా అక్కడే ఉన్న పాము కాటు వేయడంతో మృతి చెందినట్లు ఆయనతోపాటు ఉన్న కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చికిత్స కోసం చిన్న మేరంగి సిహెచ్‌సికి తరలించగా ఆయన అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారని కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం సీసాలతో ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి- జియమ్మవలస

మద్యం సీసాలతో పట్టుబడిన ఒక వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు చినమేరంగి ఎస్ఐ జి. కళాధర్ తెలిపారు. కొమరాడ మండలం మాదలంగి గ్రామానికి చెందిన కే బాబ్జి 38 మద్యం సీసాలతో పెద్ద మేరంగి జంక్షన్‌లో పట్టు బడ్డాడని సెక్షన్ 34 కింద కేసు నమోదు చేసి వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట వద్ద బొలోరా వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం బొబ్బిలి మండలం కోమటిపల్లికి చెందిన కె.నెమలమ్మ (54) లచ్చయ్యపేట వచ్చి రోడ్డు పక్కన ఉన్న చిల్లరబడ్డీ ముందు మామిడి పండ్లు అమ్ముకొని జీవనం సాగిస్తోంది. పార్వతీపురం నుండి బొబ్బిలి వెళ్తున్న బొలోరా వాహనం అత్యంత వేగంతో వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పక్కనే ఉన్న చిల్లర దుకాణాన్ని ఢీకొని నెమలమ్మపై నుంచి వెళ్లడంతో సంఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందింది. గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వాహనం నడుపుతున్న డ్రైవర్ని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసుకుని శవ పంచనామా నిమిత్తం పార్వతీపురం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

మృతి చెందిన నెమలమ్మ

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని పుట్టూరులోని సీతమ్మ కోనేరులో స్నానానికని వెళ్లిన వ్యక్తి మృతి చెందిన సంఘటన జరిగింది. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన గుగ్గిలాపు పోలిశెట్టి (59) కూలి పనులకు వెళ్లి అనంతరం స్నానానికని చెరువులోకి దిగాడు. అదుపుతప్పి నీటిలో మునగడంతో ఊపిరాడక మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ సింహాచలం, శవాన్ని వెలికి తీయించి, పంచనామ జరిపించి పోస్టుమార్టంకు తరలించారు.